# నాకీ అదృష్టం చాలు

'అన్నీ సద్గుణాలే అయితే మనిషి దేవుడు!'

'నేను దేవుణ్ణి కాను!'

'అన్నీ దుర్గుణాలే అయితే మనిషి రాక్షసుడు.'

'నేను రాక్షసుణ్ణి కాను!'

'మంచి చెడులు కలిసుంటేనే మనిషి!'

'నేను మనిషిని కాను!'

'మరి?'

'అయోగ్యుణ్ణి! పెళ్ళికి పనికిరాను. పిల్లలు కలగరు. నావల్ల నీకు భర్త ఇచ్చే సుఖం ఉండదు!'

'మొగుడు మగవాడే కానక్కరలేదు. మనిషి అయితే చాలు.'

'పొరపాటు పడుతున్నావు. నష్టపోతావు. పశ్చాత్తాప పడతావు. చేతులు కాలాక ఆకులకోసం ఆరాట పడతావు.'

'ఫరవాలేదు!'

'నన్ను పెళ్ళాడితే ఇద్దరు యువతులు పెళ్ళాడినట్లే!'

'నాకిష్టమే!'

'నువ్వంటే నాకిష్టం! నువ్వు దుఃఖ పడటం నాకిష్టం లేదు!'

'నువ్వు నా ప్రాణం! దుఃఖమే నాకు ఉండదు. అద్భుతంగా సుఖ పడతాను.'

రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి చేసుకోబోయే ముందు రోజు రాత్రి హరి రిహల సంభాషణ అది.

హరి పేదవాడు. రిహ సంపన్నురాలు. హరి అందగాడు. రిహ అందగత్తె కాదు. హరి ఎత్తు, లావు. రిహ సన్నం. హరి నలుపు. రిహ తెలుపు ప్లస్ ఎరుపు. హరి నెమ్మది. రిహ దూకుడు. హరి భయస్థుడు. రిహ ధైర్యశాలి. హరి అంతర్ముఖుడు. రిహ బహిర్ముఖి. హరి

మాట్లాడడు. రిహ మాటలాపదు. హరి ఆలోచన పరుడు. రిహ కార్యశీలి. హరి గొంగళి పురుగు, ముడుచుకు పోతాడు. రిహ పుట్టగొడుగు, విచ్చుకొంటుంది.

ఇద్దరికీ ఏమీ పోలికలేదు. పేరుతప్ప. హరిది అసలు పేరు. రిహది పెట్టుడు పేరు. హరిపేరు తిరగేసి తన పేరుగా పెట్టుకొంది. హరిని ఎగతాళి చేయటానికి రిహరిహ అని పిలిచేది. హరికూడా ఆమెను రిహరిహ అని పిలిచేవాడు. అతనట్లా పిలుస్తుంటే ఆమె కిష్టమై తన పేరు ఆరో తరగతిలో మార్చుకొంది.

ఇద్దరూ ఒకటో తరగతిలో ఒకే రోజు చేరారు. ఒకే ఎత్తు ఉండేవాళ్ళు. ఒకే బెంచీలో కూర్చునేవాళ్ళు. హరికొట్టేవాడు. రిహ నవ్వేది. అతను పారిపోయేవాడు. ఆమె వెంటపడేది. హరికొట్టినా ఇష్టమే! తిట్టినా ఇష్టమే! ముద్దు పెట్టినా ఇష్టమే!

రిహ మగపిల్లల ఆటలు ఆడేది. హరి మగపిల్లలతో ఆడేవాడు కాదు. రిహతోనే ఆడేవాడు. మగపిల్లల ఆటలు, ఆడపిల్లల ఆటలు ఇద్దరూ ఆడేవాళ్ళు. హరి ఆడపిల్లల ఆటలే బాగా ఆడేవాడు. తనను కొట్టినా, తిట్టినా, గిల్లినా, గిచ్చినా లెక్కచేయని హరి, రిహను ఎవరయినా, ఏమయినా తిట్టినా కొట్టినా సహించేవాడు కాదు. తిరిగి తిట్టేవాడు, కొట్టేవాడు.

ఒకరు స్కూలుకు రాకపోతే, మరొకరు కాలు కాలిన పిల్లిలాగా తిరిగేవాళ్ళు. రెండో రోజు రాకపోతే ఏడ్చేవాళ్ళు. మూడో రోజు వాళ్ళింటికి వెళ్ళేవాళ్ళు.

ఒకసారి క్లాసుమేటు ఒకడు రిహ జడ రిబ్బను లాగాడు. అది ఊడిరాలేదు. నొప్పి పుట్టింది. రిహ ఏడ్చింది. కన్నీళ్ళు కారిపోయాయి. రిహ ఏడుస్తుంటే హరికూడా ఏడ్చాడు.

రిహ ఏడ్పు మాని 'ఎందుకేడుస్తున్నావు?' అంది.

'నువ్వేడుస్తున్నావని'

'నేను నవ్వితే?'

'నవ్వుతా'

రిహ నవ్వింది. హరి తోడునవ్వాడు. రిహపోయి రిబ్బను లాగినవాణ్ణి చాచి చెంప పగలగొట్టింది.

వాడు తిరిగి కొట్టబోయాడు. హరి అడ్డం పోయాడు. ఇద్దరూ కలబడ్డారు. కిందా మీదా అయ్యారు. వళ్ళంతా దుమ్ము. రిహ చూస్తూ నిలబడింది. వాడూ కొట్టాడు. వీడూ కొట్టాడు. వాడూ తన్నాడు. వీడూ తన్నాడు. వాడు రిహని పెద్ద బూతు తిట్టాడు. హరికి చాలా కోపం వచ్చి మూతి మీద కొట్టాడు. పన్ను కదిలి నెత్తురొచ్చింది. వాడు పడ్డాడు. హరిభయపడ్డాడు. రిహ నవ్వింది. హరీ నవ్వాడు.

ఎవరో వచ్చి విడదీశారు. కేసు మాఫీ!

'వాడు పడ్డాడు కదా! నువ్వెందుకు ఏడవలేదూ?'

'నువ్వేడుస్తావని, భయం, ఇష్టంలేక'

'నువ్వెందుకు నవ్వావు?'

'నువ్వు నవ్వుతావని!'

'వాణ్ణెందుకు కొట్టావు?'

'నిన్ను కొట్టాడని!'

టీచరు చెప్పిన మంచి మాటలు తలకెక్కి, వాడు స్నేహం కోసం రిహకు షేక్‌హేండ్ ఇచ్చాడు. చేతిమీద ముద్దు పెట్టాడు. రిహ ముద్దు పెట్టలేదు. నవ్వ లేదు. ఊరికే ఉంది.

'షేక్‌హేండ్ చాలు! ముద్దెందుకు పెట్టావు' హరి అడిగాడు.

'నా యిష్టం' అన్నాడు వాడు.

'నీ యిష్టం చెల్లదు' అన్నాడు హరి!

'పోరా పోరా బూసడీకే' అన్నాడు వాడు.

హరి మూతిమీద కొట్టాడు. రెండో పన్ను కదిలింది. టీచరు చూచింది. బెత్తం తెచ్చింది. హరివీపుమీద వాతలు తేలాయి.

'టీచరు నిన్నంతగా కొడితే నువ్వెందుకు ఏడవలేదు?'

'నువ్వేడుస్తావని!'

'పందుచేసుకొన్నాక వాణ్ణెందుకు కొట్టావ్?'

'ముద్దు పెట్టుకొన్నాడని!'

'ఎవరు ముద్దు పెట్టుకొన్నా కొడతావా?'

'ఆఁ'

'ఎందుకు?'

'ఏమో!'

అయిదోక్లాసుదాకా వాళ్ళు ఒక చోటే కూర్చున్నా ఎవరూ ఏమీ అనలేదుకాని ఆరోక్లాసు నుంచి వాళ్ళిద్దరినీ టీచర్లు ఒకచోట కూర్చోనివ్వలేదు. టీచరు బ్లాక్ బోర్డు వైపు తిరగ్గానే ఇద్దరూ ఒకచోట చేరేవాళ్ళు. అల్లరిచేసే వాళ్ళు కారు కానీ, అందరూ అరిసిగగ్గోలు పెట్టి, వాళ్ళొకచోట కూర్చున్నారని చెప్పేవాళ్ళు. మళ్ళీ విడదీసి నేరుగా కూర్చోబెట్టాలి. అప్పటి నుంచి స్కూలు రికార్డులో కూడా ఆ పేరు రిహ అయింది. రిహ పేరు హరి, హరిపేరు రిహ పుస్తకాలమీద వ్రాసుకొన్నారు. హరి రిహ కోటి, రిహ హరికోటి వ్రాయసాగారు.

క్లాసు అయిపోగానే వాళ్ళు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుండేవాళ్ళు. వాళ్ళు ఎవరింటికి ఎవరు పోయినా వచ్చినా తల్లిదండ్రులు వాళ్ళను ప్రేమగానే చూచేవాళ్ళు.

తొమ్మిదో క్లాసులో చిత్రం జరిగింది. ఒకరోజు అకస్మాత్తుగా ఇంట్లోవాళ్ళు ఓణి చేసి రిహను స్కూలుకు పంపారు. ముందు హరి రిహను గుర్తు పట్టలేదు. గుర్తుపట్టి ఒకటే నవ్వు!

'ఎందుకు నీకు గంగిరెద్దు వేషం వేశారు?' అని అడిగాడు స్కూలునుంచి వెడుతూ.

'ఏమో' అంది. 'ఆడపిల్లలు ఓణీలు వేసుకోవాలట' అనీ, చెప్పింది.

'ఎందుకు?'

'ఏమో!' అంది ఆమె ఆటలకు ఓణీ అడ్డమౌతుంటే తీసి పక్కన బెట్టి ఆడేది.

'నాకు తెలుసు!' అన్నాడు.

'ఏమిటి?'

'నేను చెప్పను!'

చెప్పమని ప్రతిరోజూ సతాయించేది. చాలా రోజులు ఎలా చెప్పాలో తెలియక. ఏంచెప్పాలో తెలియక, ఎట్లా చెప్పాలో తెలియక ఇబ్బంది పడ్డాడు హరి.

రిహ దాడి తట్టుకోలేక ఒకరోజు చెప్పాడు 'నువ్వు పెద్దదానివి అవుతావు కదా, పెళ్ళి చేస్తారు కదా, పిల్లలు పడతారుకదా, పాలిస్తావుకదా, పాలివ్వటం ఎవరూ చూడకూడదు కదా, అందుకనీ ఓణీ!' అన్నాడు.

'ఓస్ ఇదేనా?' అంది.

'ఆ! ఇదే!'

'నేను పాలివ్వను!'

'ఇవ్వాలమ్మా!'

'నేను పెళ్ళే చేసుకోను!'

'చేసుకోవాలమ్మా!'

'చేసుకోను!'

'చేసుకోవాలి!' ఇద్దరూ చాలాసేపు ఘర్షణ పడ్డారు. ఎవరూ ఎవరి మాటా ఒప్పుకోలేదు చివరికి హరి ఒప్పుకొన్నాడు. 'చేసుకోవద్దులే' అని. వెంటనే తిరుక్కుంది. 'చేసుకొంటారు' అని. 'నీ యిష్టం' అంటే 'నీ యిష్టం' అనుకొన్నారు. అప్పటి నుంచి ఆటల్లో కూడా ఓణీ తీసి పక్కన పెట్టటం మానేసింది.

వాళ్ళు పదికి రాగానే ఒక విచిత్రం జరిగింది. రిహ స్కూలుకు రాలేదు. మామూలే 'జ్వరమా, జలుబా, తలనొప్పా' అంటూ రిహ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆంటి సున్నుండలు

పెట్టింది. అరిసెలు పెట్టింది. తిన్నాడు. 'రిహ ఏది? అని అడిగాడు. 'లోపల పనిలో' ఉందన్నాడు. మాట్లాడతానన్నాడు. 'లోపలకు పోరాదు'అన్నారు. 'రిహని రమ్మని చెప్పండి' అన్నాడు. 'రారాద'ని చెప్పారు. 'ఏం?' అన్నాడు. 'అది అంతే' అన్నారు. హరికి కోపం వచ్చింది. ఎవరినైనా కొట్టాలని పించింది. ఎవరిని కొట్టాలి? ఆంటీ మంచిది. అంకుల్ చాలా మంచి వాడు. ఎవరెవరో ఆడవాళ్ళు వస్తూపోతూ ఉన్నారు. చలిమిడి పెట్టారు. తిన్నాడు. ఎంతసేపున్నా వాళ్ళు కలుసుకొనే వీలు కలగలేదు. నిరాశగా ఇంటికి వెలుతూ, రిహను పలకరించి పోతున్న పెద్దమ్మను అడిగాడు. 'అదా నాయనా! రిహ సింహాసనం ఎక్కింది?' అంది. 'అంటే ఏమిటి?' హరికి దిక్కుతోచలేదు. రెండు వారాలు రిహ స్కూలుకు రాలేదు. హరి చాలా దిగులు పడ్డాడు. అన్ని రోజులు రిహను పలకరించకుండా చూడకుండా తానుండలేడు.

రిహ స్కూలుకు వచ్చిన రోజు అద్భుతంగా ఉంది. తన రిహేనా అని ఆశ్చర్య పోయాడు.

పట్టు పరికిణి వేసుకొంది. పట్టు జాకెట్టు తొడుక్కొంది. పట్టు వోణీ వేసుకొంది. చెవులకు, మెడలో, ముక్కుకు నగలు పెట్టారు. రెండు చేతుల నిండా రంగురంగుల మట్టిగాజులు. బంగారు గాజులు తొడిగారు. తలనిండా పూలు పెట్టారు. పటాల్లోని లక్ష్మీదేవి లాగా ఉంది. పత్రికల్లోని సినీమా స్టారులాగా ఉంది. బట్టల షాపుల్లోని బొమ్మలాగా ఉంది. తలనిండా పూలు అవి అటుకదిలి, ఇటుకదిలి, నువు బాగున్నావా? నువు బాగున్నావా? అని అందరినీ అడుగుతున్నాయి.

రోజంతా హరి పాఠం వినలేదు. రిహను చూస్తూనే ఉన్నాడు.

స్కూలు వదిలి ఇళ్ళకు వెలుతున్నప్పుడు హరి రిహ చేయి పట్టుకోవటానికి భయపడ్డాడు. రిహనే పట్టుకొంది.

'ఎందుకిన్ని రోజులు రాలేదు?'

'రానీయలేదు!'

'ఎక్కడున్నావు?'

'ఇంటిలోనే!'

'ఏం చేశారు?'

'వద్దన్నా కొద్దీ ఏమేమో తినిపించి చంపారు!'

'సింహాసనం ఎందుకెక్కావు?'

'సింహాసనమా పాడా?'

'మరీ?'

'పచ్చి తాటాకులు కొట్టి తెచ్చి, వాటిమీద కూర్చోబెట్టి, అవి ఎండిపోగానే తీసి స్నానం చేయించారు.'

'అదా సింహాసనమంటే?'

'అదే!'

'అదేం సింహాసనం?'

'ఏమో!'

'నిన్ను చూస్తుంటే భయంగా ఉంది. సంతోషంగా ఉంది'

'ఎందుకూ?'

'ఏమో!'

'చాలా బాగున్నావు!'

'నిజమా?'

'నిజం!'

పది పాసయిన ఎండాకలం హరి కాళ్ళమీద తేలిపోయాడు. మూడు నెలల్లో మూరెడెత్తు లేచాడు. ఎందుకంత ఎత్తు లేచాడో తెలియదు.

'ఏమయింది నీకు?'

'ఏమో!'

'ఎందుకు ఇంతెత్తు పెరిగావు?'

'ఏమో!'

ఇద్దరూ ఇంటరులో చేరినప్పుడు హరి పాత నిక్కర్లు డ్రాయర్లు అయిపోయాయి. కొత్త నిక్కర్లు తొడుక్కొన్నా అందరూ కాళ్ళను 'ములక్కాడలు' అంటున్నారు. అందరూ అంటే అన్నారు. రిహకూడా అంటుంటే హరికి కోపం వచ్చింది. అతను ఉడుక్కొంటున్నకొద్దీ ఆమె అనటం ఎక్కువ చేసింది.

'నీతో మాట్లాడను' అన్నాడు.

'నేను మాట్లాడతాను!' అంది.

'నిన్ను చూడను'

'నిన్ను చూస్తాను'

'నీతో రాను!'

'నీతో వస్తాను'

'నీతో పచ్చి!'

'నీతో పండు! హరి బంగారు!'

'నిజమా? నిజం నువ్వు బంగారు!'

'నువ్వు కూడా బంగారు'

ఇద్దరూ మామూలే. కలిసిరావటం, కలిసి పోవటం, కలిసి మెలిసి తిరగటం. హరి పైజామాలు కుట్టించుకొన్నాడు.

ఇంతకుముందు వాళ్ళు మామూలుగా మాట్లాడుకొనేవాళ్ళు. ఇప్పుడు రిహ ఆకాశంలోకి చూస్తేనే హరి కనిపిస్తున్నాడు. హరి భూదేవిని చూస్తేనే రిహ కనబడుతుంది. ఆమె తలెత్తి పరికించాలి. అతను తల దించుకొని మాట్లాడించాలి.

రిహ డబ్బు, పెన్ను హరిజేబులో ఉంచేది. ఇంట్లో ఏం వండుకొన్నా తెచ్చేది. స్కూల్‌లో కలిసి తినేవాళ్ళు. వాళ్ళను బావామరదళ్ళు అనుకొనే వాళ్ళు అందరూ. వాళ్లను ఎవరూ పట్టించుకొనేవాళ్ళుకాదు.

ఇంటరు సెకెండు ఇయర్‌కి హరి దాదాపు ఆరు అడుగుల పొడుగు పెరిగాడు. దూడల్లో ఎద్దులాగా ఉండేవాడు. క్లాసుమేట్లు ఆడ పిల్లలు హరిని విరగబడి చూచేవాళ్ళు. వాళ్ళు రహస్యంగా 'బొంగు' అని చెప్పుకోవటం వింది రిహ. ఆమెకు కోపం వచ్చింది.

వాళ్ళిద్దరినీ నిలదీసింది. 'ఏమన్నారు?' అంది. 'మా యిష్టం' అన్నారు. 'మీ యిష్టం చెల్లదు' అంది. 'నేనొప్పుకోను!' అంది. 'నువ్వెవతెవే ఒప్పుకోకపోవటానికి' అని తుస్కారంగా మాట్లాడారు. 'నా బావ' అందామనుకొంది 'నా భర్త' అందామనీ చూచింది. ఏమీ అనలేదు. కోపంతో రేగిపోయింది. ఊగిపోయింది. ఇద్దరినీ జుట్టుపట్టుకొని వంచి వీపులమీద దబీదబీమని బాదింది. వాళ్ళూ బిత్తరపోయారు. తిరగబడ్డారు. పూలు జారాయి. ఓణీలు తొలగాయి. జడలూడాయి. పుస్తకాలునేలపాలయ్యాయి. ఎవరో వచ్చి విడదీశారు. ఎవరూ ఎవరికీ ఏమీ కంప్లెయింట్ చేయలేదు. వాళ్ళెందుకు కొట్టుకొన్నారో ఎవరికీ తెలియలేదు.

'ఎందుకు వాళ్ళతో గొడవపడ్డావు?' అడిగాడు హరి.

'నేను చెప్పను' అంది.

'ఎందుకు చెప్పవు?'

'మంచిమాట కాదు!'

'ఏంమాట?'

'నిన్నే!'

'ఏమన్నారు?'

'నేను చెప్పను'

బ్రతిమాలితే ఏడుస్తూ చెప్పింది. 'బొంగు'. మళ్ళీ ఏడ్చింది. 'నిన్ను బొంగు' అన్నారు.

అంది. 'తప్పుకదా! అనరాదుకదా! నిన్నంటే నేనెట్లా ఊరుకొంటాను?' అంది.

పొడుగ్గా సన్నగా పెరిగానని నా ఫ్రెండ్స్ కూడా నన్ను 'బొంగులాగా పెరిగావురా' అంటారు.

'బొంగు అంటే తప్పుకాదా?'

'తప్పేం కాదు!'

'అడ్డ పేరుతో పిలవచ్చునా?'

'అడ్డ పేరు తప్పే!'

'అందుకే కొట్టాను!'

'నన్ను ఎవరైనా ఏమైనా అంటే పోయి వాళ్ళను కొడతావా?'

'కొడతాను!'

'ఎందుకు?'

'నా యిష్టం కొడతాను. నువ్వు నా ఫ్రెండువి.'

'అంతేకదా!'

'అంతేకాదు, ఇంకా చాలా, చాలా, నువ్వే నేను, నేనే నువ్వు. నిన్నేమయినా అంటే నన్ను అన్నట్లే.'

హరి కళ్ళు చెమర్చాయి.

ఆ ఎండాకాలం మంచి టైలర్ దగ్గరకు తీసుకుపోయి, నాలుగు జతల పేంటులు షర్టులు కుట్టించింది.

అవి వేసుకొని హరి వస్తుంటే రిహ కళ్ళార్పకుండా చూచింది. బట్టలంత నిండుదనం తెస్తాయని ఆమెకు అంతకుముందు తెలియదు.

ఇద్దరూ డిగ్రీలో ఒకే గ్రూపులో చేరిన రోజుల్లో హరి మూతిమీది వెంట్రుకల్ని గోటితో పట్టుకొంటూ ఉండటం చూచి, కాఫీ తాగుతున్నప్పుడు, ఎదురుగా కూర్చున్న రిహ మొలుస్తున్న మీసాలు గోటితో పట్టుకొని పీకింది. కుయ్యో మొర్రో మంటూ ఎగిరి పడ్డాడు. కాఫీ ఒలికింది. మీదపడింది.

పక్కనున్న పెద్దామె 'కాలే కాఫీ తాక్కపోతే ఏం నాయనా' అంది.

హరి కళ్ళలోంచి నీటిబొట్లు జలజలా రాలిపడ్డాయి.

రిహ కర్చీపు తీసుకొని, షర్టుమీద, పేంటుమీద పడ్డ కాఫీ తడితుడిచింది. మరక మిగిలిపోయింది.

హరి వాతలు పెట్టినట్లు ఎగురుతున్నాడు. 'ఏమయిందని ఏమయిందని' అని చుట్టూ ఉన్నవాళ్ళు అడుగుతుంటే, ఏమయిందో చెప్పలేక బిక్క చచ్చి కూర్చున్నాడు.

వాళ్ళిద్దరూ మౌనంగా కూర్చున్నారు. చుట్టూ ఉన్న వాళ్ళు తమను చూడటం మాని, తినే తాగే పనిలో ఉన్నప్పుడు రిహ అడిగింది.

'నొప్పి పుట్టిందా?'

'నొప్పి కాదు, మంట, ప్రాణం పోయింది'

'అయ్యో, సారీ!'

'సారీ వద్దులే! ఫరవాలేదు!'

'తడుస్తుంటే ఎగిరిపడ్డావెందుకు?'

'ఏమో! నన్ను ముట్టుకోవద్దు!'

'ఏమి?'

'గిలిగింతలా?'

'ఏమో?'

'చక్కలిగిలా?'

'ఏమో! నన్ను ఎప్పటికీ ముట్టుకోవద్దు. నేను భరించలేను. నాకు భయం. నాకు సిగ్గు, నాదొక దీనావస్థ.'

'ఏమయింది?'

'ఏమో!'

'ఏమవుతుంది?'

'ఏమో! ఇంకా విషయం వదిలెయ్'

పోయి నీళ్ళతో పేంటూ షర్టూ కడిగి, తుడిచి, తిరిగి వచ్చాడు. మళ్ళీ రిహ కాఫీ చెప్పింది. తాగుతూ కూర్చున్నప్పుడు మధురంగా పాట వినబడుతూ ఉంది. గ్రాంఫోను రికార్డు.

'హరి రిహ ముగ్ధ విలోలవిలోచన' గొప్ప సంగీతం. రిహ పరుగెత్తుకుపోయి పాట మళ్ళీ మొదలు పెట్టింది.

'హరి రిహ ముగ్ధ విలోల విలోచన'

మళ్ళీ పెట్టింది. మళ్ళీ అదే వినిపించింది. మళ్ళీ! మళ్ళీ!

'ఏమిటా అరిగిపోయిన రికార్డు?' ఎవరో అరిచారు.

మళ్ళీ పాట పెట్టటం ఆపింది. పాట పేరురాసుకొంది. రికార్డు పేరు రాసుకొంది. దొరికే చోటు తెలుసుకొంది.

తిరిగి వచ్చి హరి దగ్గర కూర్చుంది. హరి ఆ పాట ప్రవాహంలో కొట్టుకు పోతున్నాడు.

'విన్నావా?' అడిగింది.

'వింటున్నాను!' అన్నాడు.

'రికార్డు ఆగిపోయింది'

'అయినా పాట వినబడుతూ ఉంది.'

'మనపాటే'

'మనదే'

'హరిరిహ ముగ్ధవిలోల విలోచన' ఇద్దరూ పాడారు. 'హరి రిహ' అన్నారు. 'హరి రిహ' అన్నారు 'హరి రిహ' అని నవ్వారు. పెద్దగా హోటలు బిత్తరబోయేట్టుగా.

రిహ పాటకోసం రికార్డు కొంది. రికార్డుకోసం గ్రాంఫోనుకొంది. వందల చానళ్ళున్న టీవిలుండగా గ్రాంఫోను ఒక్క రికార్డు కొంటున్న శాల్తీని వాళ్ళు విచిత్రంగా చూశారు.

వాళ్ళకు పదాలతో సంబంధం లేదు. అర్థంతో అవస్థా లేక పదరూపాలతో పేచీలేదు. హరి రిహ పదాలు రెండూ జంటగా మధుర సంగీతంలో, సంస్కృతంలో ఉండటం వాళ్ళకు ఆనందం, ఆశ్చర్యం, హరి పేరు వాళ్ళ అమ్మా నాన్నే పెట్టారు. రిహ పేరు తానే పెట్టుకొందీ అమ్మాయి. హరి రిహ అని దేవతలే తమ పేర్లు ఒకచోట చేర్చారని రిహ నమ్మింది. 'స్వర్గంలో మన పెళ్ళి అయిపోయింది' అంది. 'భూమి మీద మనం నడుస్తున్నా మన పునాదులు స్వర్గంలో ఉన్నాయం'ది. 'మనది జన్మ జన్మల సంబంధం' అంది. 'ఈ జన్మలో మనం విద్యార్థులం. పోయిన జన్మలో దేవతలం, ఏడేడు జన్మలకు మనం ఒకే జంట' అంది.

హరి, అంతగా ఆనందించలేదు. మౌనంగా ఉన్నాడు. పెళ్ళి అనేమాట హరికి వణుకు పుట్టించింది.

డిగ్రీ పూర్తి కాగానే రిహకు పెళ్ళి చేయాలని తల్లిదండ్రులు ప్రయత్నించారు.

ఆమె వద్దంది. ఏం చేస్తావంటే చెబుతానంది.

ఆ సాయంకాలం హరిని పలకరించి 'మరి మనం ఏం చేద్దామం'ది.

'చదువుదాం!' అన్నాడు

'ఏం చదువుదాం?'

'లా'

ఇంట్లో లా చదువుతానంది రిహా. బిడ్డమాట తల్లిదండ్రులు మన్నించారు.

ఇద్దరూ లాలో చేరినప్పుడు రిహ తల్లిదండ్రులు ఆమెకు స్కూటీ కొని ఇచ్చారు. ప్రాక్టీసు బాగానే చేసింది. తను పూర్తిగా నేర్చుకొన్నాన అనుకొన్నాకే స్కూటీతో స్కూలు ప్లేగ్రౌండ్‌నుంచి ఊరి రోడ్డుమీదికి వచ్చింది. ఇంటికి పోయింది. లా కాలేజికి వచ్చింది. ఇక ఆమె ధైర్యానికి అంతుపొంతూ లేదు.

మర్నాడు ఉదయమే లేచి, హరి వాళ్ళ ఇంటికి పోయింది. అతనింకా పళ్ళు తోముకొంటున్నాడు. తొందర చేసింది. వెంటపడి అన్నీ అందించింది. ముందుగా రడీ చేసింది. స్కూటీ మీద ఎక్కించుకొంది.

రిహకి స్కూటీ బాగానే ఉంది కానీ, ఇద్దరు కూర్చునేసరికి అది ఎత్తు తగ్గిపోయింది. అరడుగుల హరి స్కూటీ మీద కూర్చుంటే కాళ్ళు మడిచి ఎక్కడ పెట్టాలో తెలియకుండా ఉంది. కాళ్ళు నేల తగులుతున్నాయి. నానా అవస్థ పడుతూ కూర్చున్నాడు.

గాడిద ఆరోగ్యం బాగున్నట్లు లేదు. ఎక్స్‌పర్ట్ డ్రైవరు రిహకు అడ్డం వచ్చింది. కానున్న కార్యం హరికి అర్థమయింది. గాడిదకు డొక్కశుద్ధి లేదు. అందుకే డొక్కకు తగిలింది. గాడిద సంగీతం ఆలపించసాగింది. హరిలేకపోతే ఏమయ్యేదో కాని కాళ్ళు నేలమీద పెట్టి, కాళ్ళ బ్రేకు వేసి రిహను పట్టుకొంటే స్కూటీ పడింది. హరి నిలబడ్డాడు. రిహను ఎత్తుకొన్నాడు.

తోవన పోయేవాళ్ళు 'గాడిద గాడిద' అన్నారు. తననే 'గాడిద' అంటున్నారని రిహ గింజుకొంది. హరి స్కూటీ తీసి రిహకిచ్చి, 'నువ్వు నడుపుకుని వస్తే ఇద్దరం నడిచి అయినా కాలేజీకి పోదాం, లేదా నువ్వు వెనుక కూర్చో నేను నడుపుతాను. నేనే నడుపుతానని నువ్వంటే-'

'నడుపుతాను!'

'నమస్కారం' అని చేతులు జోడించాడు.

'లేదు! నేనే నడుపుతాను'

'వద్దు! నా మాట విను!'

'వినను. నడుపుతాను!'

'మొండి! ఏంచేస్తాం పద!'

ఇద్దరూ ఎక్కారు. స్కూటీ బయలుదేరింది.

'ఎట్లుంది?' అంది.

'భయంగా ఉంది' అన్నాడు.

'ఏం భయపడవద్దు! సురక్షితంగా చేరుస్తాను కాలేజీకి'

'కాలేజీకి చేరుస్తావు బాగానే ఉంది. కాళ్ళనేం చేయమంటావు?'

'కాళ్ళకేమయింది?'

'పొడుగయ్యాయి!'

'మడిచి కూర్చో!'

'కూర్చుంటే–'

'ఏమి?'

'నిన్ను పొడుస్తాయి!'

'పొడవనీ!'

'కింద పడతావు!'

'పడను!'

'గేరంటీ?'

'గేరంటీ?'

కాలేజీలో దిగి, హరి మోకాళ్ళు వత్తుకొంటున్నాడు.

'ఏమయింది?' అంది.

'మోకాళ్ళ నొప్పి!'

'ముసలితనమా?'

'కాదు, స్కూటీతనం!'

'అంటే?'

'కాళ్ళు నీకు పొడుచుకోకూడదని, నానా ఇబ్బందీపడి, ముడిచికూర్చున్నా'

'అయ్యో!'

'అయ్యో లేదు, కుయ్యోలేదు. స్కూటీ ఎక్కమని నన్నిక సతాయించవద్దు'

'వినాయకుడికి ఎలుక వాహనం!' అని విద్యార్థులు నవ్వుతూ పోతున్నారు.

'విన్నావా? ఎంత పొగరు?'

'పొగరేం ఉంది అందులో. విశాలమయిన మనిషి. చిన్న వాహనం మీద వచ్చాడన్నారు'

'కాదు!'

'మరి?'

'స్కూటీని కాదు. నన్ను. వాళ్ళు ఎలుక అంది నన్ను!'

హరి ఆలోచనలో పడ్డాడు.

మర్నాడు ఉదయం హరిని షోరూంకు తీసుకుపోయింది. మోటారు సైకిల్ ఇచ్చారు వాళ్ళు.

'నువ్వు మోటార్ సైకిల్ నడపగలవా?'

'నాకు కాదు. నీకే!'

'వద్దు!'

'వద్దంటే స్కూటీమీద రావాలి. నేనే నడపాలి.'

'వద్దు!'

'అయితే ఇది తీసుకో నువ్వే నడుపు! నన్ను వెనక ఎక్కించుకో!'

తాళాలు చేతికిచ్చింది.

మోటార్ సైకిలు స్టార్టు అయింది. కాలేజీలోకి వస్తున్నప్పుడు కదలకుండా కూర్చో! అల్లరి చేయవద్దు' అన్నాడు.

'చేస్తా!' అంది.

'అయితే దిగిపోతా!'

'వద్దు. వాళ్ళముందు ఆపు.'

ఆపాడు. దిగింది. వాళ్ళను చూస్తూ వాళ్ళు వినేలా, 'వినాయకుడిమీద ఎలుక' అంది. అని పకపకా నవ్వింది.

వాళ్ళు విన్నారు. చూశారు. ముఖం మాడ్చుకొన్నారు.

రిహ విజయ గర్వంతో జుట్టు ఎగరేసుకొంటూ నడుస్తూ ఉంది. మగపిల్లలు ఊరికే ఉంటారా? 'వినాయకుడికీ, ఎలక్కీ పెళ్ళి. గొప్ప దంపతులురా బాబూ!' ఎగతాళి చేస్తూ నవ్వుతూ వెళ్లారు.

రిహ మళ్ళీ ముఖం మాడ్చుకొంది.

'వాళ్ళేమన్నారో విన్నావా?'

'విన్నాను!'

'వాళ్ళతిక్క కుదర్చాలి'

'ఎలా?'

'మన పెళ్ళి ఎనౌన్స్ చేయాలి!'

'ఆ ఆశలు పెట్టుకోవద్దు!'

'ఏయ్! ఏమంటున్నావు నువ్వు?'

'ఆ ఆశలు పెట్టుకోవద్దన్నాను'

'ఏం ఎందుకు?'

క్లాసురూం దగ్గరకు వచ్చినందువల్ల మరేం మాట్లాడుకోకుండా లోపలికి పోయారు.

క్లాసునుంచి బయటకు రాగానే అడిగింది. క్లాసులో పాఠం విన్నట్లుగా లేదు. ఆమాటే ఆలోచిస్తున్నట్లుగా ఉంది.

'నేను పెళ్ళికి అనర్హుణ్ణి!'

'ఏమయింది?'

'నా మాట విను! మనం మంచి స్నేహితులుగా ఉందాం! పెళ్ళి ఆలోచన పెట్టుకోవద్దు!'

'ఎందువల్ల?'

'వద్దన్నాను! అంతే!'

'నీకు లేనివన్నీ నా దగ్గరున్నాయి. ఇల్లు, పొలం, డబ్బు, మానాన్న కోటీశ్వరుడు. నీకేం భయం వద్దు!'

'భయంకాదు, బాధ! నాకులేంది, నీ దగ్గర లేదు'

'అంటే? అంటే ఏమిటి నువ్వనేది!'

'నీకెట్లా చెప్పాలి!'

'ఎట్లయినా సరే! చెప్పాలి!'

'నేను మగవాణ్ణి కాదు!'

రిహ నవ్వేసింది.

'టెస్టా?'

'టెస్ట్ కాదు. నిజం చెబుతున్నా'

'నీకంటే మగవాడెవడున్నాడు పదవయ్య పెద్ద మనిషి!'

'నిజం రిహ!'

'నీ నిజం తగలెయ్య. చాలు ఊరుకోవయ్య'

'ఉన్నమాట చెప్పాను. నీ యిష్టం!'

'నిజం చెప్పేశా'నని హరి ఆనందంగా ఉంటే, 'నన్ను ఆటలు పట్టిస్తే నేనా మోసపోయేది?' అని రిహ హుషారుగా ఉంది.

ఇక వాళ్ళిద్దరూ తిరగని చోటులు లేవు. హోటళ్ళు వాళ్ళవే! పార్కులూ వాళ్ళవే! సినీమాహాళ్ళూ వాళ్ళవే!

బజారుకూ కలిసే, మార్కెట్టుకూ కలిసే, షాపింగుకూ కలిసే!

రెండు ఇళ్ళ వాళ్ళూ వాళ్ళను వేరుచేయనక్కరలేదని తీర్మానించుకొన్నారు. లెక్చరర్సు, స్టూడెంట్స్ వాళ్ళను మొగుడూ పెళ్ళాలనీ అనుకొంటున్నారు. తాను హరి భార్యనే అనుకొంటుంది రిహ. ఈ పిచ్చిది ఎలా బాగుపడుతుందని హరి ఆలోచిస్తున్నాడు.

'నువ్వు మగవాడికాకపోతే, నిన్ను తాకినా, ముద్దుపెట్టినా నాకెందుకీ పులకరింత కలుగుతుంద'ని నిలదీసింది.

'నువ్వు అనుకొన్న దాన్నిబట్టి నీ ఆనందం ఉంటుంది. నీళ్ళు తాగుతూ, అది అమృతమని నువ్వనుకొంటే అది అమృతమే! సుఖం దుఃఖం మనం అనుకోవటంలో ఉంటాయి. ఇది సుఖం అనుకొంటే ఎంత కష్టమయినా కనీసం కష్టం లాగా ఉండదు. ఇది దుఃఖం అనుకొంటే ఎంత సంతోషమయినా ఏడుపు తెప్పిస్తుంది. వస్తువుకు సహజంగా ఏరంగూ రుచీ వాసనా లేకపోయినా ఏవి ఉన్నాయని నువ్వనుకొంటావో, అవన్నీ అందులో ఉన్నట్లు అనిపిస్తుంది. దొంగ సన్నాసిని నువ్వు దేవుడనుకొంటే అతను దేవుడే! తాడును పాము అనుకొంటే అది నీకు పామై కనబడుతుంది. భయపడతావు. ఏడుస్తావు!'

'కాటు వేయలేదుకదా!'

'కాటు వేయుటం, వేయకపోవటం ముఖ్యం కాదు. పామని, కరుస్తుందని అనుకోవటం–అసలు విషయం. నన్ను నువ్వు మగవాడు అనుకొంటున్నావు. అందువల్ల మగమనిషి అనుభూతులే నీకు కలుగుతాయి. నిజానికి నీది తాడు–పాము కత. హెచ్చరించటం నా ధర్మం. నువ్వేమన్నా చేయి నాకేమీ చలనం ఉండదు. కారణం నువ్వు యువతివి అని నేను అనుకోవటం లేదు. ఫ్రెండ్ అనుకొంటున్నాను. భార్య అనుకోలేను. నీ సుఖశాంతులు కోరుతున్నాను. మోసం చేయలేను. నీ యిష్టం.'

'నాకీ సంతోషం చాలు. మరేం చెప్పవద్దు. పదపోదాం!'

హోటల్లో కాఫీ తాగారు. రిహను వాళ్ళ ఇంటిదగ్గర డ్రాపు చేసి తిరిగి ఇంటికి వచ్చాడు హరి. రాత్రంతా ఒకటే ఆలోచనలు. నిద్రపట్టలేదు. రిహను బాగుచేసే మార్గం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

రిహ పువ్వు అనీ, పరిమళం ఆఘ్రాణించాలని, తాకి మురికి చేయరాదని హరి అభీష్టం!

తుమ్మెద కాళ్ళకింద నలిగి, ముక్కుకింద మూలిగి, తేనెంతా తాగేస్తుంటే తన్మయత్వంతో సొమ్మసిల్లి పోవాలని పూవు కోరే సంగతి హరికి అర్థంకాదు.

తమ మధ్య ఏ హద్దులు ఉండరాదనీ, అన్నీ హరి చెరిపివేయాలని రిహ ఆరాటం.

రిహ స్నేహం గౌరవిస్తూ, పసిపాప వెన్న బుగ్గలు పదిలంగా పట్టుకొన్నట్లు ఆమెను ఆరాధించాలని హరి అంతరాత్మ.

తమ పరిస్థితి ఇద్దరూ ఇళ్ళలో చెప్పలేదు. ఇద్దరూ పెద్దలాయరు దగ్గర జూనియర్లుగా చేరారు.

కోర్టుకు ఎండాకాలం సెలవులు ఇచ్చినప్పుడు రిహ పెళ్ళి కాకపోయినా హనీమూన్‌కే అనుకొని, హరితో ఊటికి పోయింది. మధ్యలో తీర్థయాత్రలు చేశారు. పుణ్యక్షేత్రాలు దర్శించారు. ఇద్దరూ హోటళ్ళ రూంలలో కలిసి ఉన్నారు. ఒకే బెడ్‌మీద పడుకొన్నారు. ఆమె మీద పడినా ఊరుకొన్నాడు. కానీ మనిషిలో చలనం లేదు. ఉత్సాహంగానే ఉంటాడు. కానీ కదలడు, మెదలడు. ప్రేమగానే ఉంటాడు. ఆత్మీయంగానే పలకరిస్తాడు. కానీ ఆదరంగా దగ్గరకు తీసుకోడు.

వీధిలో కొజ్జావాళ్ళు చప్పట్లు కొట్టుకొంటూ పోతుంటే రిహ వాళ్ళను చూపి, 'వాళ్ళు ఎట్లా ఉంటారో నాకు తెలుసు' అంది. 'ఏం తెలుసు' అన్నాడు. 'ఆడవేషాలు వేసుకొని, చప్పట్లు కొట్టుకొంటూ వీధుల్లో అడుక్కొంటూ పోతుంటారు' అంది. 'వాళ్ళు మేం మగవాళ్ళం కాము అంటే ఎవరయినా నమ్ముతారు' అంది. 'అట్లా లేని నీలాంటి వాళ్ళు నేను మగవాణ్ణి కాదు అంటే ఎవరూ నమ్మరు' అని ఆమె ఉద్దేశం.

హరి సరిగానే అర్థం చేసుకొన్నాడు. 'ఆడవాళ్ళు వేరు. ఆడవాళ్ళులాగా అలంకరించుకొనే కొజ్జాలు వేరు. నేను వేరు. నేను అందరి దృష్టిలో మగవాణ్ణే అసలు సిసలు మగవాణ్ణే. కానీ నిజానికి మగవాణ్ణి కాను. అర్థంచేసుకో! జీవితం బాగుచేసుకో!'

'అయిందా?' అసహనంగా అడిగింది. 'ఎవరు మగవాళ్ళో ఎవరు కారో నాకు బాగా తెలుసు. నువ్వు మగవాడివే. నిస్సందేహంగా మగవాడివే!'

'సరేకానీ! నువ్వు మరొకరిని చూచుకొని పెళ్ళిచేసుకో!'

'సరే! నువ్వు చెప్పినట్లే నీ మాటవిని మరొకర్ని పెళ్ళాడతా! నువ్వు భరించగలవా?'

'భరించగలను!'

'భరించలేవు. నీ గురించి నీకు తెలియదు. నాకు తెలుసు. నన్ను వదిలి నువ్వు ఉండలేవు.'

'నిజమే!'

'నేను మరొకళ్ళి పెళ్ళాడితే, నువ్వు నన్ను వదిలి ఉండాలికదా!'

'ఏమవసరం? మన స్నేహం కొనసాగుతూనే ఉంటుంది.'

'అది కుదరదు!'

'ఎందువల్ల?'

'నా భర్త నిన్ను కలవనివ్వడు!'

'మన స్నేహం గొప్పదని చెబుతాను.'

'నమ్మరు'

'ఋజువు చేస్తాను!'

'నీతో తిరిగే సమయం పెళ్ళయ్యాక నాకుండదు!'

'రిహా!' హరికి కోపం వచ్చింది.

'కోపమెందుకు! నా భర్త, నా సంసారం, నా పిల్లలు. నా పనులు, నా బాధ్యతలు. మనస్నేహానికి చోటెక్కడుంటుంది!'

హరి మౌనంగా ఉన్నాడు. 'సరే! అయినా సరే! నువ్వు పెళ్ళిచేసుకోవాలి.'

'పెళ్ళంటూ చేసుకొంటే నిన్నే చేసుకొంటా, కలిసి ఉందాం. పెళ్ళి వద్దనుకొంటే మనం కలిసే ఉందాం!'

'అంతేనా?'

'అదే నా నిర్ణయం'

'నీ నిర్ణయం నీకు పెద్ద శిక్షకాకూడదు.'

'కాదు'

'అనుభవిస్తావు!'

'అనుభవించాలనేకదా!'

'అయితే మనం కలిసి ఉందాం'

'కలిసి ఉండటం నిశ్చయమైతే, పెళ్ళి చేసుకొనే కలిసి ఉందాం.'

సీనియరు వీళ్ళను బాగా ప్రోత్సహిస్తున్నాడు. చిన్న కేసులకు శిక్షణ ఇచ్చి కోర్టుకు పంపుతున్నాడు. వీళ్ళు సంతోషంగా ఉన్నారు కానీ పెళ్ళిమీద రిహా, కోర్టులమీద హరి దృష్టి పెంచుకొంటూ ఉన్నారు.

'మా ఇంట్లో చెప్పాను, మా అమ్మానాన్నా ఒప్పుకొన్నారు. ఇల్లు చూశాను. మనం మన ఇంటికి మారదాం' అంది రిహా.

హరి ఏం మాట్లాడలేదు.

రిహా ఎందుకో రెట్టించి ఏమీ అడగలేదు.

సొంతంగా కోర్టులో కేసువాదించి గెలిచి, అందరు మన్ననలు తొలిసారిగా పొందినపుడు సీనియరు 'మగవాడివనిపించుకొన్నావ్' అన్నాడు, అభినందన పూర్వకంగా.

కేసు గెలిచాను కానీ, మగవాణ్ణి కాదే అనుకొన్నాడు హరి.

ఆరోజు ఆమె అభినందించింది. 'ఈ రోజు నుంచి మనం కలిసి ఉంటున్నాం' అంది రిహ. 'మీ తండ్రి, మామామ నన్ను ఆశీర్వదించారు' అంది. 'నీ సామాను తెచ్చి ఇంట్లో పెట్టించాను' అంది. 'సరే!' అన్నాడు. 'సరే అన్నావుకదా!' 'అవును' మరి పెళ్ళి చేసుకొనే కలిసి ఉందాం' 'సరే!'

'ఇవాళే మనం ఇద్దరం పోయి మా తల్లిదండ్రులతో ఈ శుభవార్త చెబుదాం, పెళ్ళి ఏర్పాట్లు చేస్తారు'

'చెబుదాం, కానీ అనవసరమైన ఆర్భాటాలు వద్దు. రిజిష్టరు మేరేజీ చేసుకొందాం'

'సరే నీ యిష్టం'

నెలరోజులకు మిత్రుల సమక్షంలో ఇద్దరూ పెళ్ళిచేసుకొన్నారు.

'నిన్ను వదిలి నేనుండలేక నీతో పెళ్ళికి అంగీకరించాను. ఈ పెళ్ళివల్ల నీకు సంసార సుఖం ఉండదు. చిన్ననాటి మన మైత్రి కొనసాగుతూ ఉంటుంది. నువ్వెప్పుడు ఈ పెళ్ళి వద్దనుకొంటే తక్షణం రద్దు చేసుకొందాం. భర్త కావాలనుకొంటే, నాతో స్నేహం కొనసాగిస్తూ కూడా, నీ ప్రయత్నం నువ్వు చేయవచ్చు!'

'నీకు మతి ఉందా? తెలిసి మాట్లాడుతున్నావా? పిచ్చిగా మాట్లాడకు'

'నీమీద ప్రేమతో మాట్లాడుతున్నాను' 'నువ్వెక్కడి కయినా వెళ్ళు, ఎప్పుడయినా రా, మనయింటి తలుపులు నీకెప్పుడు తెరవబడి ఉంటాయి. నీకు మగవాడి అవసరం ఉంటుంది. నాకు నీ స్నేహం చాలు!'

'నువ్వే స్నేహితుడివి. నువ్వే మగవాడివి. నువ్వే భర్తవి! కష్టమో సుఖమో నీతోనే!'

'కష్టమే!'

'సుఖపడతాను చూడు'

'అత్యాశ!'

'కాదు! నా ప్రయత్నాలకు నువ్వు అడ్డుచెప్పవని తెలుసు.'

వాళ్ళు కోర్టు పనులు దీక్షగానే చూచుకోసాగారు. సీనియరుకు తగిన సహాయకులుగా ఉన్నారు.

రోజంతా కోర్టు పనుల్లో తలమునకలయినా, ఇంటికి వచ్చినప్పటి నుంచి, రిహ భర్త ప్రేమ పొందటానికి గట్టి ప్రయత్నాలే చేయసాగింది.

అతనేమీ అడ్డుచెప్పటం లేదు.

ఎవరు చూచినా మంచి ఈడూ జోడూ అంటారు. రిహను చాలా ప్రేమగా

చూచుకొంటాడు. హరికి బాగా అణకువగా అణిగిమణిగి ఉంటుందామె. మోటర్ సైకిలు స్థానంలో కారు వచ్చింది. అంతా బాగానే ఉంది. ఆరు నెలలయింది. ఆమె ప్రయత్నంలో లోపం లేదు. ఏ యువతీ చేయనంత ప్రయత్నం చేసింది. తాను ఓడిపోదలచలేదు రిహ.

హరిని డాక్టర్ల దగ్గరకు తీసుకుపోయింది. పరీక్షలు చేయించింది. తాను, జనంకోసం, పరీక్షలు చేయించుకొంది.

అంతా సవ్యంగా ఉంది. ఏ లోపమూ లేదు. మరి ఏమిటీ పరిస్థితి? చిన్నప్పటి నుంచి తన అన్ని విషయాలు తెలిసిన ఫేమిలీ డాక్టరుకు తన సమస్య చెప్పింది రిహ. ఆమె, తన భర్తకూడా పేరుమోసిన డాక్టరే, చర్చించి ఇద్దరినీ పిలిపించి, ఇద్దరినీ వేరు వేరుగా, ఇద్దరిని కలిసి ఏకంగా కౌన్సిలింగ్ చేశారు.

రిహకు అతను తప్ప స్నేహితులు లేరు. హరి పరిస్థితీ అంతే. అయితే రిహ పదిమందితో గలగలా మాట్లాడగలదు. హరి ఎవరితోనూ మాట్లాడలేడు. కానీ చిత్రం కోర్టు కేసులు వచ్చాక లౌక్యంగా అవసరమయిన వాళ్ళతో, అవసరమయినంత మేరకు మాట్లాడ గలుగుతున్నాడు.

స్నేహితుడూ భర్తా హరే కావాలని రిహ తాపత్రయం. రిహ భార్యగా అక్కరలేదు. స్నేహితురాలుగా ఉండాలని హరికి ఇష్టం.

ఆమె ఎవరినైనా పెళ్ళాడవచ్చు. కానీ తన స్నేహితురాలుగా ఉండాలి.

వీళ్ళ స్నేహం ఎంతకాలం కొనసాగుతుంది?

డాక్టర్లు అయిన భార్యాభర్తలు ఇద్దరూ కలిసి మాట్లాడుకొని రిహతో చెప్పారు, సైకియాట్రిస్ట్‌కు చూపించమని.

'హరి మానసికంగా పూర్తి ఆరోగ్యవంతుడు' అంది రిహ.

అయినా చూపమన్నారు. 'సెక్స్‌లో శారీరక చర్యకంటే మానసిక పరిచర్య చాలా విశిష్టం. సైకాలజీ ప్రొజెక్టరు. తెరమీది బొమ్మ మనిషి శరీరం. ఇది ప్రవర్తిస్తుంది. కానీ ప్రవర్తింపచేసేది ప్రొజెక్టరు. అది ఆరోగ్యంగా ఉండాలి. అది ఆరోగ్యంగా ఉంటేనే తెరమీద ఈ శరీరం ఎగురుతుంది. గంతు తీస్తుంది. ఆడుతుంది. పాడుతుంది. ఆ ఆరోగ్యం ముఖ్యం. తప్పక చూపించు!'

భార్యాభర్తలు రాష్ట్రంలో పెద్ద సైకియాట్రిస్టుల్ని కలిశారు. ఒక డాక్టరు మీద వీళ్ళకు గురి కుదిరింది. అతనొక్కడే ట్రీట్ చేస్తానన్నాడు. మిగతావాళ్ళు కబుర్లు చెప్పి, ట్రాక్విలైజర్స్ ఇచ్చి పంపారు.

ఇద్దరినీ కలిపి విషయాలు అన్నీ విన్నాడు. ఒక్కొక్కరినీ పిలిచి విడివిడిగా సమస్య విన్నాడు. ఫిజికల్‌గా పరీక్షలు జరిపిన డాక్టర్ల రిపోర్టులు చదివాడు. ఆ భార్యాభర్తలిద్దరితో ఫోనులో మాట్లాడాడు.

రిహను ఒక్కదాన్నే పిలిచి మాట్లాడాడు. 'ఈ జబ్బు పెద్దదికాదు. నయమవుతుంది'

రిహకు పరమానందం కలిగింది. డాక్టర్ల కంటే భార్య, స్త్రీ, ఏ స్త్రీ అయినా, అతను బాగా ఇష్టపడే స్త్రీ ఈ రోగం నయం చేయగలదు.'

'హరి అన్ని విధాలా కోరుకొనే స్త్రీని నేనే!'

'అయితే నువ్వే బాగుచేయగలవు'

'ఏం చేయమంటారు?'

'అతనికి మానసిక అనారోగ్యం ఉందని తెలియనివ్వకూడదు!'

'హరిది చాలామంచి ఆరోగ్యం డాక్టరు'

'నిజమే శారీరకంగా చాలామంచి ఆరోగ్యవంతుడు. మానసికంగా అంతమంచి ఆరోగ్యం లేదు. నువ్వు మానసికరోగివి అనకూడదు. అసలు మానసిక అస్వస్థత ఉందని అతను అనుకోకూడదు. అతన్ని ఉత్సాహపరుస్తూ ఉండాలి.'

'ఉత్సాహపరుస్తూ వచ్చాను డాక్టరు!'

'గుడ్. మరింత ఉత్సాహపరుచు! అతనికి భయం ఉంది.'

'చాలా ధైర్యస్థుడు డాక్టరు!'

'శారీరకంగా ధైర్యం ఉంది. కానీ మానసికంగా పిరికివాడు' రిహనోట వెంట మాటలు రావటంలేదు.

'సెక్స పట్ల భయం ఉంది. అది ఎందుకు కలిగిందో నేను చెప్పలేను. తెలుసుకొనే క్లూ తానేమీ చెప్పటం లేదు. ఆ భయం కనీసం అతడికి కూడా తెలియకపోవచ్చు. అనుభవాల అంతరాంతరాలలో అది మరుగునపడి మూతపడి బైటికి రాకుండా ఉండవచ్చు. ఏ పరిస్థితుల్లోనైనా ఆ మూత తొలగి ఆ అనుభవం బైటపడితే, అతడి భయం తొలగించవచ్చు. ఆ భయం తొలగితే, అదే మూలకారణమైతే, అతడు మామూలు మగవాడు కాగలడు.

కొందరు మనుషుల్లో రతిక్రీడ హింసగా, క్రూరంగా, క్రోధంగా, కసిగా ముద్రపడిపోతుంది. అది అతి బాల్యంలో పడిన ముద్ర అయితే ప్రభావం మాత్రమే కనిపిస్తుంది. దాంతో మనుషులు గిడసబారిపోతారు. కవున్సిలింగ్ ద్వారా దాన్ని తొలిగించవచ్చు. అయితే సమస్య ఇదేనని స్పష్టం కావాలి.

కొందరు అతిచిన్నతనంలో రతిక్రీడ చూచి, దాన్ని అసహ్యంగా, రోతగా, నీచంగా భావిస్తారు. భంగిమ అవమానకరంగా అమానవీయంగా రాక్షసంగా జుగుప్సగా తలపోస్తారు. అది మనస్సు మారుమూలల్లో ఘనీభవించి, ఆ గడ్డకట్టిన అనుభవం, అతడి వ్యక్తిత్వ భవనం పునాదిలో కూరుకొని పోయి ఉండవచ్చు. అదే నేపథ్యం, హేతువుకావచ్చు. ఇది ఇది అని

స్పష్టమయితే కవున్సిలింగ్ ద్వారా సరిచేయవచ్చు. దేని మూలం ఏదో వారే గుర్తించి, హరిని బాగుచేయటానికి నాకు సహాయం చేయాలి.

స్పష్టంగా గుర్తుంచుకొండి. అతను మానసిక రోగి. అలా అని అతనికి తెలియదు. మామూలుగా చూస్తే అలా అనిపించదు. అతిబాల్యంలో అతడి తీవ్ర భయం, సందేహం, అసహ్యం, కసి, క్రోధం, కోపం, జుగుప్సవంటివి కలిగి వాటి పునాదులమీద పెరిగాడు. అవి నయమయితే అతడు మామూలు మనిషి, కాకపోతే అతను ప్రమాదకర వ్యక్తిగా మారవచ్చు. ఇంతకాలం అతడు సౌమ్యుడుగా సహజంగా. మామూలుగా ఉండటం నీ స్నేహం వల్లే! దాన్ని అతను వదులుకోలేడు. అతన్ని నువ్వే బాగుచేయగలవు. అప్పుడు అతను నిన్ను వదులుకోలేడు. అప్పుడు నువ్వు అదృష్టవంతురాలివి!

సైకియాట్రిస్టు హరినికూడా పిలిచి, కబుర్లు చెప్పి, జబ్బు ఏమీ లేదని, అంతా మామూలుగా ఉందని, మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలని, మాత్రలు వ్రాసి ఇచ్చి, వీలున్నప్పుడల్లా కనిపిస్తూ ఉండమని చెప్పి, మీరు తొందరలో నాకు మనుమణ్ణి చూపాలంటే ఇద్దరూ సరేనన్నారు రిహ నవ్వింది. హరి ముఖం మాడ్చుకొన్నాడు.

ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఇద్దరూ మామూలుగా తమ కోర్టు పనులు చేసుకుపోతున్నారు.

డాక్టర్లు, సైకియాట్రిస్టులు పరీక్షలు అయ్యాక, రిహ మీద హరికి మరింత ప్రేమ పెరిగింది. ఆత్మీయంగా చూచుకోసాగాడు. కానీ మునుపటి పరిస్థితిలో మార్పులేదు.

హరి భయాన్ని జయించాలి. అది జరగాలంటే ముందు భయం ఏమిటో తెలియాలి.

రిహ అతడి గత జీవితం గూర్చి ఆలోచింపసాగింది. అయిదేళ్ళ వయస్సు ఉన్నప్పటి నుంచి హరి తనకు తెలుసు. భయంకరమైన సంగతులు, సన్నివేశాలు ఏమీ లేవు. తననెవరైనా ఏమయినా అంటే వాళ్ళను హరి కొట్టేవాడు. పళ్ళు కదిలేటట్లు కొట్టేవాడు. తానంటే ప్రేమవల్ల అలా కొట్టేవాడనుకొంది. ప్రేమే కారణం కావచ్చు. అంతగా కొట్టటంలో ఏదో కసి, క్రోధం, కోపం, ద్వేషం కూడా ఉండి ఉంటే ఉండవచ్చు. పళ్ళు కదిలేట్టు కొట్టవలసినంత నేరాలు కావు అవి. ఈ విషయం డాక్టరుతో చెప్పాలి. ఆపైన మళ్ళీ ఎప్పుడూ ఎవరిమీద అటువంటి కోపం ప్రదర్శించలేదు.

అయినా డాక్టరును కలిసి బాల్య విషయాలు వివరంగా చెప్పింది. డాక్టరు చెప్పాడు. 'అది నిజంగా ప్రతిచర్యే! దానికి మూలమైన చర్య ఏదో ఉంటుంది. అది అయిదేళ్ళకంటే ముందే జరిగి ఉంటుంది. అదేదో తెలుసుకొనే ప్రయత్నం చేయి' అన్నాడు.

'హరికి రెండున్నరేళ్లప్పుడు తల్లి చనిపోయింది'

'సహజ మరణమేనా? అప్పుడు హరి ఎక్కడున్నాడు? ఏంచేశాడు? వాళ్ళమ్మను వాళ్ళ తండ్రికొట్టేవాడా? కొట్టిచంపలేదు కదా!'

'తండ్రి చాలా ఉత్తముడు, అటువంటి మనిషి కాడు'.

'బాల్యంలో హరి తండ్రిదగ్గర పడుకొనేవాడా? తల్లిదగ్గరా? వేరుగానా?'

'తెలియదు!'

'తెలుసుకో. హరిమామూలు మనిషి అవుతాడు'

'థాంక్స్ డాక్టర్!'

చిన్నప్పుడు హరి ఎక్కడ పడుకొనేవాడో ఎంత అడిగినా తెలియదన్నాడు. మూడేళ్లకు ముందు జరిగినవేవీ చెప్పలేకుండా ఉన్నాడు. తల్లి చనిపోవటం కూడా తెలియదు.

హరిలేకుండా అతడి తండ్రి దగ్గరకు పోయిన రిహ 'అత్తగారు ఎలా చనిపోయారు?' అని అడిగింది. మామ కంట తడిపెట్టుకొన్నాడు.

'అన్నీ మర్చిపోయాను' అన్నాడు.

'అసలు ఏం జరిగింది!' అడిగింది.

'నేను చెప్పలేను!' అన్నాడు

"కాదు చెప్పండి' అంది

'నీకు చెప్పలేను!' అన్నాడు.

'దయచేసి చెప్పండి' అంది.

'చెప్పను. తప్పు. అడక్కూడదు. వెళ్ళు' అని గద్దించి పంపాడు. పాతికేళ్ళనాటి మాట. హరికి అప్పుడు మూడేళ్ళు. మామ చెప్పకపోయినా తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తూనే ఉంది.

హత్యనా? ఆత్మహత్యనా? సహజమరణమా? అని తెలుసుకొనే ప్రయత్నం చేసింది. లాయరు బుద్ధులు బాగా ప్రదర్శిస్తూ వచ్చింది. ఆమె మరణానికి సంబంధించి ఏకేసు అయినా జరిగిందా? ఏ శిక్షలయినా పడ్డాయా? పోలీసు రికార్డులు ఏమయినా దొరుకుతాయా? తీవ్రంగా ప్రయత్నించింది. ఏ ఆచూకీ తెలియలేదు.

సైకియాట్రిస్టుతో సమాచారమంతా చెప్పి, తన సందేహాలు వెలిబుచ్చింది. 'సందేహాలు శాస్త్రం కాదు. సందేహాల ద్వారా సత్యం, సత్యం ద్వారా శాస్త్రం పరిశీలింపవచ్చు. ప్రయత్నించు.'

సైకియాట్రిస్టును కలుసుకొంటూనే ఉంది. తన ఆలోచనలు చెబుతూనే ఉంది. ఆయన తనకు తోచింది చెప్పి పంపుతూనే ఉన్నాడు.

రిహ ప్రయత్నాలు చూచిన హరి 'నీ మీద నాకు జాలి రిహ. ఏ ప్రయత్నాలూ చేయకు. నీ బతుకింతే! దురదృష్టవంతురాలివి. నువ్వు వేరే మగవాడితో ఉండలేవు. నీ స్నేహం లేకుండా నేను బ్రతకలేను' అన్నాడు.

రిహ నిశ్చింతగా, నిస్సంకోచంగా నిండుగా నవ్వింది. 'నాకీ అదృష్టం చాలు' అంది.

ఒకరోజు మామ వచ్చి 'నిన్ను తేపతేపకూ చూడాలనిపిస్తుందమ్మా' అన్నాడు.

'ఎందువల్ల మామగారూ!'

'వాళ్ళమ్మ పోలికలు నీలో ఉన్నాయి'

రిహకు భయంకలిగింది. వెంటనే పట్టరాని ఆనందంతో గంతులేసింది.

'ఎందుకమ్మా అంత సంతోషం?'

'చనిపోయిన మీ భార్య, మా అత్తగారి పోలికలు నాకుండటం వల్ల మీరు నన్ను ఆదరంగా చూస్తున్నారు'

'నిజమే! ఆమె జీవితంలా నీ జీవితం కాకూడదు తల్లి!'

'ఏమయింది మామగారూ!'

'ఏమీ కాలేదయ్యా!' మామ వెళ్ళిపోయాడు.

చనిపోయిన తల్లి రూపం ఏదో కనిపించి హరి తనతో స్నేహం చేశాడని, తనలో తల్లిని చూచుకొంటున్నాడు కాబోలునని, మదర్ పిక్సేషన్ వల్లే తనను మరింత ప్రేమగా చూచుకోవాలి అని అతిసన్నిహితంగా ఉంటున్నాడనీ, వదలలేకుండా ఉన్నాడనీ గ్రహించింది.

సైకియాట్రిస్టు చాలా సంతోషించి, ఆమె మరణ హేతువు కనుక్కోమని ప్రోత్సహించాడు.

రిహ వంట చేస్తూ వడ్డిస్తూ, కేసులు చూస్తూ, కోర్టు పనులు చూచుకొంటూ, సీనియరు చెప్పే పనులు చేస్తూ, అత్త మరణ నేపథ్యం తెలుసుకొనే ప్రయత్నంలో ఉంది.

అది మామకు మాత్రమే తెలుసు. ఎవరికీ చెప్పడు. హరికి తెలుసు. కానీ గుర్తు లేదు. చెప్పలేడు.

తేపతేపకు మానును రిహ సతాయిస్తుంటే విసిగిపోయి 'నువ్వు నన్ను కలుసుకోవద్దు.'

'నా కష్టం నేనెవరితో చెప్పుకోవాలి' అంది.

'ఏం కష్టం?'

రిహ హరి విషయం అంతా పూర్తిగా వివరించి, తన దుఃఖం వెళ్ళగక్కిందే కానీ ఏడవలేదు.

సైకియాట్రిస్టును కలిసిన సమాచారం చెప్పింది. 'అత్త మరణం గూర్చి తెలిస్తే హరి ఆరోగ్యం బాగుపడవచ్చు' అంది.

మామ చాలా సేపు ఆలోచించాడు. 'జరిగిందంతా సిగ్గు లేకుండా చెబుతాను. కానీ ఇది నువ్వు ఎవరికీ చెప్పకూడదు.'

'చెప్పను.'

'హరితో అసలు ప్రస్తావించరాదు'

'ప్రస్తావించను.'

'సైకియాట్రిస్టుతో ఏమీ చెప్పకూడదు!

'చెప్పను!'

మామ జరిగింది పూర్తిగా చెప్పాడు. రిహ శ్రద్ధగా వింది. మామ కాళ్ళకు వంగి దండం పెట్టింది. ఎవరికీ చెప్పనంది. చెప్పలేదు. భర్త పట్ల ప్రేమ పెరగజొచ్చింది. అతిగారాబంగా చూచుకోసాగింది. 'తల్లి ప్రేమ ఇలాగే ఉంటుందా?' అన్నాడొకసారి. 'ఇంతే!' అంది.

గతానికి వర్తమానానికి సంధి కుదురుతుందా? కుదురుతుంది.

చేతనావస్థ కానీ, అచేతనావస్థకానీ, చేతనాచేత నా వస్థను జాగృతం చేస్తుందా? చేస్తుంది.

చేతనా చేతనావస్థ ప్రభావం, అచేతనావస్థలో మరుగు పడి ఏ పరిస్థితులలో అయినా చేతనావస్థకు వస్తుందా? వస్తుంది.

గతాన్ని వర్తమానం చేయవచ్చునా? చేయవచ్చు.

రిహ ఆలోచనల్లో మునిగి తేలుతూ ఉంది. కోర్టుపనులు వెనకపడ్డాయి. ఇంటి పనులు సవ్యంగా లేవు.

వంట్లో బాగుండటంలేదని ఇంట్లో పడుకొంటూ ఉంది. ఇంట్లో వంట లేదు. హోటల్ తిండి. హరి దిగులుపడుతున్నాడు. రిహకు కష్టం కలిగితే తాను సుఖంగా ఉండలేనని గ్రహించాడు. ఏంచేయమంటే అదే చేస్తున్నాడు. హరికోర్టుకు పోవటం లేదు. ఆమెకు తోడుగా ఇంట్లోనే ఉండిపోతున్నాడు.

'నేను లేకపోతే నువ్వు బతకగలవా హరీ!'

'బతకలేను!'

'నేను చచ్చిపోతే!'

'నేనూ చచ్చిపోతాను!'

'నాకేమయినా అయి నేను నీకు దూరమయిపోతే-'

'అలాకావు. చింతవద్దు' అన్నాడు.

కోర్టు నుంచి వస్తున్నప్పుడు, డ్రైవ్ చేస్తున్న హరితో చెప్పింది. ఒంటరిగా వెళుతున్నప్పుడు ఎవరో ముగ్గురు హంతకులు, దొంగలు, రౌడీలు నన్ను వెంటాడుతున్నారని చెప్పింది.

'ఎక్కడ? ఎవరు? ఏరి?' అని కారు ఆపాడు.

'ఇక్కడలేరు. నువ్వు నా వెంట లేనప్పుడే వెంటాడుతున్నారు' అంది.

హరి నవ్వాడు. 'ఎప్పుడూ నాతోనే ఉండాలనా? అలాగ్గే! నీ వెంటే ఉంటాను. వరీకావొద్దు' ఊరడించాడు.

'నాకు భయంగా ఉంది!'

'నేనున్నాను! నీకెందుకు భయం?'

రిహకు కొంత మనశ్శాంతిగా ఉంది. ఆమెకు ధైర్యం చెబుతూనే ఉన్నాడు. 'మనవన్నీ కోర్టులు. కేసులు, చాలా మందికి శిక్షలు పడుతుంటాయి. జైలుకు వెళుతుంటారు. వాళ్ళు కక్షగట్టవచ్చు. జాగ్రత్త' అన్నాడు.

'అలాగ్గే!' అంద రిహ.

ఒకరోజు తెల్లవారు జామున తాను బాత్‌రూంకు పోయినప్పుడు ఒక అంబాసిడర్ కారులో హంతకులు వచ్చి రిహను కిడ్నాప్ చేశారు.

హరి బయటకు వచ్చి అడిగితే పాలవాడు కారు గుర్తులు చెప్పాడు. నంబరు తెలియదన్నాడు. డ్రైవరు కాక ముగ్గురున్నారన్నాడు. రిహ అమ్మగారిని బలవంతంగా ఈడ్చుకు వచ్చి కారులో పడేసి తీసుకుపోయారు. మామూలువాళ్ళుగా లేరు. హంతకులులాగా ఉన్నారు.

హరి కారు తీసుకొని వాళ్ళు వెళ్ళిన రోడ్డులో బయలుదేరి వెళ్ళాడు.

వాళ్ళు దొరకలేదు.

హరి పోలీసులకు రిపోర్టు చేశాడు. అత్త మామలతో చెప్పాడు. తండ్రితో వివరాలు ఇచ్చాడు.

ఎవరైనా డబ్బు అడుగుతూ ఫోను చేయవచ్చునని, ఆ విషయం తనకు వెంటనే చెప్పమని రెండు కుటుంబాలకు స్పష్టంగా చెప్పాడు.

హరి ఆమెకోసం వెదుకుతూనే ఉన్నాడు. కోర్టుకు పోలేదు. అన్నం తినలేదు. గడ్డం గీసుకోలేదు. స్నానం చేయలేదు. ఇంటిపట్టున ఉండటంలేదు. ఒకే తిరుగుడు! ఎక్కడని వెదుకుతాడు! ఆచూకీ లేకపోయింది.

ఫోనూ రాలేదు. డబ్బూ డిమాండు చేయలేదు. మూడు రోజులు గడిచాయి. రిహ ఆచూకీ లేకుండా పోయింది.

హరి వెర్రి వాడులాగా మారాడు. కోపం, కసి పెరుగుతున్నాయి.

అయిదు రోజులకు రిహ ఫోను చేసింది. తనను చంపేస్తున్నారంది. 'నేను బతకలేను' అంది. అది దొంగిలించబడ్డ ఫోను! రిహ పత్తాలేదు.

హరి పోలీసు స్టేషన్ల చుట్టూ పత్రికల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాడు. రిహ శవం

వివరాలు అయినా దొరుకుతాయేమోనని, దొరక లేదు.

అల్లుడి అవస్థ చూడలేక అత్తామామలూ, కొడుకు దుస్థితి చూడలేక తండ్రీ, కుమిలిపోతున్నారు. రిహ కనబడక, హరీ పిచ్చివాడయితే తమ గతేం కానని దిగులుపడుతున్నారు.

హరి గడ్డం పెరిగిపోయింది. స్నానం పానం లేదు. బట్టలు మార్చుకోవటం లేదు. అన్నంతినటం లేదు. అన్ని పనులూ మానాడు. ఫోను దగ్గరే కూర్చున్నాడు. సెల్ జేబులోనే ఉంది. ఇంటిలోనే ఉండి పోయాడు. హరిబతికి ఉన్నాడంటే గుర్తు ఫోనులే!

రెండు వారాలకు రిహ ఫోను చేసింది. హరి ఆనందం పట్టలేక ఏడ్చేశాడు. వాళ్ళ నుంచి తప్పించుకొన్నాను. రాత్రి ఇంటికి వస్తానని చెప్పింది. తనే వస్తానంది. తనకోసం రావద్దంది. నువ్వు వస్తే వాళ్ళు మనల్ని పట్టుకొంటారంది.

హరి సంతోషంగా ఏడుస్తూనే ఉన్నాడు. రిహ ఎప్పుడొస్తుందా అని వాకిట్లోనే కూర్చుని చూస్తున్నాడు. శరీరంలో వణుకు, సంచలనం, కోపం. ఏదో చెప్పలేని మార్పు!

రోడ్డుమీద రద్దీ తగ్గిపోయింది. సెకెండ్ షో సినిమా జనంకూడా వెళిపోయారు. కుక్కల అరుపులు, పోలీసుల విజిళ్ళు తప్ప ఏమీ వినబడటం లేదు.

లోపలికి పోయి, లైటు ఆర్పి, డోరు బార్లా తెరిచి, మంచం దిండుకానుకొని కూర్చున్నాడు హరి తేపతేపకూ వాకిలి వైపు చూస్తున్నాడు. గది చీకటి. హృదిచీకటి. శరీరంలో ఎక్కడో సూర్యోదయం.

తెల్లవారు జామున రిక్షాలోంచి ఎముకల పోగులాగా, శవంలాగా ఉన్న ఆడమనిషి దిగింది. తూలుతూ, పడుతూ, లేస్తూ, మూలుగుతూ, ఏడుస్తూ వాకిట్లోకి వచ్చింది. పరుగెత్తుకుపోయి రిహను కౌగిలించుకొన్నాడు హరి. ఆమె ఏడుస్తూ ఉంది.

'నేను పడుకొంటాను' అంది. 'తలుపెయ్' అంది. 'వాళ్ళు వస్తారో ఏమో చూడ'మంది వణుకుతూ ఉంది.

రిహను పడుకోబెట్టి, హరి పక్కనే చేరాడు. లైటు వేయలేదు.

దుప్పటి కప్పమంది. కప్పాడు. వణుకుతూనే ఉంది. 'నన్ను వాటేసుకో' మంది 'సరే!' అన్నాడు.

'ఎవరు వాళ్ళు? అడిగాడు.

'కొంచెం ఆగు. దడ తగ్గనీ!' అంది. ఆగాడు.

'పడుకో!' అంది. పడుకొన్నాడు 'ఏంజరిగింది?' అడిగాడు. 'చెబుతానుండు' రొప్పుతూ ఉంది. 'దగ్గరకురా' అంది. జరిగాడు.

'వాళ్ళు దొంగలా రౌడీలా హంతకులా?' అని అడిగాడు.

'వ్యభిచారులు!' అంది.

'గుర్తు పట్టగలవా?'

'మనిద్దరినీ చంపుతారు!'

'వాళ్ళే దేవూరు?'

'ఒకవూరా? అన్ని వూళ్ళూ తిప్పారు' వణికింది. ఏడ్చింది. రొప్పింది. హరిని వాటేసుకొంది. 'గట్టిగా పట్టుకో' అంది. పట్టుకొన్నాడు.

'ప్రతీకారమా?'

'కాదు!'

'డబ్బు కోసమా?'

'కాదు!'

'మరి?'

'మదం. కామం. వెధవలు!'

'ఏం చేశారు?'

'ఏమో చేశారు! అదంతా ఎందుకు? నేను బతికాను. నాకు అంతేచాలు! మనకంతే చాలు.'

'నాకూ అంతే చాలు! కానీ! నీ దుఃఖం చూడలేను. నీ హింస భరించలేను. స్నానం చేస్తావా?'

'చేయను.'

'ఏమయినా తింటావా?'

'తినను'

'నీళ్ళు తాగుతావా?'

'తాగను'

'వాళ్ళు నిన్ను హింస పెట్టారా?'

'చంపేశారు! ఒక్కడు కాదు! ముగ్గురు. ముసలివాళ్ళుకారు. పాతికేళ్ళ యువకులు.'

'సారీ! రిహ!'

'హరి నీ తప్పేం ఉంది? నా కర్మగానీ!'

హరి గొంతు ఏడ్చినట్లుంది. రిహ ఏడుస్తూనే ఉంది. 'ప్రతిరోజూ ఇదే తంతు' రిహ చెబుతూ ఉంది.

పెద్ద హాలు. సన్నగా వెలుతురు. పాత పెంకుటిల్లు. ఆ యిల్లు వాళ్ళది కాదు. ఇంట్లో పాతికేళ్ళ తండ్రి. రెండున్నరేళ్ళ కొడుకు. ఇద్దరినీ పట్టుకొని ఇంటి హాలు స్తంభాలకు కట్టేశారు. నోట్లో గుడ్డలు కుక్కారు.

నన్ను మంచానికి కట్టేశారు. మూర్ఖులు. దొంగలు. రౌడీలు హంతకులు వ్యభిచారులు. జైలు నుంచి విడుదలై వచ్చారు. కొట్టారు. తన్నారు. క్రూరంగా హింసించారు.

నేను ఏడుస్తుంటే కొట్టారు. నోట్లో గుడ్డలు పెట్టారు. పసివాడు, పడుచువాడు చూస్తున్నా, చేయరాని పని - చెప్పలేను. హింస, నరకం. ఏడవనుకూడా ఏడవలేదు. మౌన నిశ్శబ్ద నరకం.

'అమ్మా!' అరిచాడు హరి. పిల్లవాడి నోట్లో గుడ్డలున్నాయి. అరవలేదు. నీ నోట్లో గుడ్డ లేదు. అరుస్తున్నావు.

వొంటిమీద ఉన్న గుడ్డలన్నీ చించేశారు. చెంపలు పగలగొట్టారు. కాళ్ళతో తన్నారు. గోళ్ళతో రక్కారు.

'అమ్మా!' హరి అరిచాడు. పిల్లవాడు అరవలేక పోయాడు. పడుచువాడు, అరవలేక, ఏమీ చేయలేక కళ్ళు మూసుకొని మౌనంగా రోదిస్తున్నాడు.

'నాన్నా!' హరి అరుస్తున్నాడు. ఆ పిల్లవాడు ఇలాగ్గే అరవాలనుకొన్నాడు. నోరులేదు. వాళ్ళు రాక్షసులు. ఒక పసివాడు మరో పడుచువాడి ముందు బలహీనురాలు. ఆశక్తురాలు, నగ్నంగా దిగంబరంగా పడి ఉంటే వాళ్ళ ఇష్టం కొరికారు. గిచ్చారు. రక్కారు. గిల్లారు. వళ్లంతా రక్తం!'

'అమ్మా!' హరి అరుస్తున్నాడు. వాళ్ళు సిగరెట్లు తాగుతున్నారు. బుద్ధి పుట్టిన చోట కాలుస్తున్నారు. వాళ్ళ ఇష్టం. వాళ్ళ తృప్తి తీరటానికి ఏంచేయ్యాలో అది చేస్తున్నారు. వళ్ళంతా రక్తం! పుళ్ళు! గాయాలు. మూడు రోజులు అదే పని. నిద్రలేదు. తిండి లేదు. నీళ్ళు లేవు. పిల్లవాడు స్పృహ తప్పి పడిపోయాడు. పడుచువాడు స్థంభానికి అతుక్కుపోయాడు. ఇద్దరూ కళ్ళు తేలేశారు.

'అమ్మా! నాన్నా!' అంటూ హరి ఏడుస్తున్నాడు. ఆ పిల్లవాడి గొంతులో గుడ్డలు తీసినా బాగుండేది. ఏడవనిచ్చినా బాగుండేది. దుఃఖం ఏడవలేదు. హింస.

నా గొంతు పిసికారు. గొంతుమీద కాలేసి తొక్కారు. శరీరమంతా తన్నులు, దెబ్బలు. వళ్ళు హూనమయింది. నేను చనిపోతున్నాననుకొన్నాను.

'అమ్మా!' అంటూ రిహాను వాటేసుకొన్నాడు హరి. 'అమ్మా' అంటూ ఏడుస్తున్నాడు. నా కట్లు విప్పారు. కార్లో పడేశారు. మరో ఊరు. మరోచోట. అక్కడా ఇంతే! తిండి పెట్టారు. నీళ్ళిచ్చారు. కానీ రాక్షసులే!'

'పాపం ఆ పడుచువాడు ఏమయ్యాడో?'

'చచ్చిపోలేదు. బతికాడు'

'పసివాడికి స్పృహ వచ్చిందో రాలేదో!'

'వచ్చింది. అమ్మా బాగా చదివి లాయర్ను అయ్యాను'

'సంతోషం హరీ!'

'అమ్మా! వాళ్ళను చంపుతాను'

'వాళ్ళు దొరకరు కొడుకా! పిచ్చితండ్రి. వాళ్ళెప్పుడో ఎక్కడో ఎలాగో చచ్చారు.'

'అమ్మా నేను వాళ్ళను వదలను.'

'వాళ్ళను మర్చిపో తండ్రి! తల్లిని కాపాడుకో!'

'అమ్మా!' అంటూ రిహ గుండెలమీద పడి హరి ఏడుస్తున్నాడు.

'వాళ్ళు వేరే ఊళ్ళో ఇదేపని!'

'ఏమిటి?'

'నన్ను వేరే ఊరుతీసుకుపోయారు'

'అమ్మా నువ్వు చనిపోలేదా?'

'హరీ! హరీ! హరీ! నేను మీ అమ్మను! చనిపోలేదు హరీ!'

'అమ్మా నువ్వు బ్రతికే ఉన్నావా? ఇంతకాలం ఏమయ్యావు?'

'నీ వెంటే ఉన్నాను హరీ! మీ అమ్మను కాదు'.

'నువ్వు మా అమ్మవే అమ్మా!'

'కాను. నీ భార్యను'

'మా అమ్మలే అమ్మా'

'కాదు! రిహను, నీ భార్యను, లాయర్ను!'

'కాదు! అమ్మా! కాదు. రిహ! రిహా! నువ్వు మా అమ్మవు కాదా! అవునా రిహా, నువ్వే మా అమ్మవు! నా తల్లివి. బతికావు. అంతే చాలు.'

'కాదు! రిహను. నీ భార్యను, లాయర్ను!'

'కాదు. అమ్మా కాదు. రిహా! రిహా! నువ్వు మా అమ్మవు కాదా! అవునా రిహా!'

'అవును హరీ!'

'రిహా!'

'అవును హరీ!'

'రిహా! వాళ్ళు నిన్ను చంపేశారా?' అమ్మను చంపేశారా?"

'లేదు. బతికించారు.'

'హింసించలేదా?'

'హింసించారు. సుఖంగా వుంది!'

'కొట్టలేదా?'

'కొట్టారు. హాయిగా ఉంది!'

'గిచ్చలేదా? కొరకలేదా? సిగరెట్లతో కాల్చలేదా? అమానుషంగా ప్రవర్తించలేదా? తొక్కలేదా? తన్నలేదా అమ్మా, రిహా, అమ్మా, రిహా, అమ్మా రిహా, ఆ క్రౌర్యం భరించావా?'

'భరించాను, క్రూరంగా ప్రవర్తించారు. అయినా సంతోషంగా ఉంది. అంత సుఖం నేను ఇంతవరకు అనుభవించలేదు.'

'అది సుఖమా?'

'సుఖమే!'

'అది ఆనందమా?'

'ఆనందమే!'

'అది సంతోషమా?'

'సంతోషమే!'

'హింస సుఖమా, సంతోషమా, ఆనందమా?'

'ఆఁ! సుఖమే!'

'వాళ్ళను చంపుతాను.

'చంపలేవు!'

'దొరకరు!'

'నిన్ను చంపుతాను.'

'చంపు! సుఖమే! చంపగలవు. ఏదీ చంపు!'

'చావు!'

'మగాడివైతే చంపు!'

బెడ్‌షీట్ లాగి అవతల పారేశాడు. చీరె చింపేశాడు. జాకెట్టు లాగేశాడు.

'చంపటంలో సుకుమారత్వం ఉంటుంది' అంది.

'ఉంటుంది' అన్నాడు. అలిసిపోయిన హరి లుంగీ చుట్టుకొంటూ రిహకు లంగా ఇచ్చాడు. ముద్దులతో ముంచెత్తాడు.

మంచం మీంచి లేవని రిహ హరిని వాటేసుకొని వదల్లేదు. ఊపిరాడక ఉక్కిరి బిక్కిరయ్యాడు.

లైటు వేసి, 'గాయాలు, పుళ్ళు, సిగరెట్టు కాల్పులు చూప'మని అడిగాడు. 'నువ్వు అసలు సిసలు మగాడివి కాగానే అవి మాయమయ్యాయి, అంది. అప్పుడే విచ్చుకొన్ని పువ్వులాగా ఉంది రిహ.

ఏ గాయం లేదు. ఏమచ్చలేదు. ఏ పుండు లేదు.

'రిహ! థాంక్స్!' అన్నాడు హరి.

'నాకీ అదృష్టం చాలు!' అంది రిహ.